ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

7

శనివారం 7 డిసెంబరు 2024

భూ బాధితులు బారులు



రేపల్లె: పేటేరులో రెవెన్యూసిబ్బందికి సూచనలు చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



మంగళగిరి: రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

- జిల్లా అంతటా రెవెన్యూ సదస్సులు
- 16 గ్రామాల్లో సభలు.. 353 అర్జీల స్వీకరణ
- భూ సమస్యలకు పరిష్కారం చూపేలా సదస్సులు
- వడ్డేశ్వరం సదస్సులో అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు జిల్లా అంతటా శుక్రవారం ప్రారంభమయ్యాయి. భూముల పరంగా ఉన్న చిక్కులను తొలగించడంతో పాటు ఐదేళ్లలో వైసీపీ చేసిన అక్రమాలను నిగ్గు తేల్చి బాధితులకు అండగా ఉండేందుకు రెవెన్యూ సదస్సులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఆయా గ్రామాల్లో భూ యజమానులు, రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టి తీసుకొచ్చారు. జిల్లాలోని అర్బన్, సీఆర్‌డీఏ ప్రాంతాలు మినహా అన్ని గ్రామాల్లో సదస్సుల నిర్వహణకు ముందుగానే షెడ్యూల్‌ని ప్రకటించింది. ఆ మేరకు తొలి రోజున శుక్రవారం మొత్తం 16 గ్రామాల్లో సదస్సులను నిర్వహించగా 353 అర్జీలను భూయజమానులు అందజేశారు.

● తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో జరిగిన సదస్సులో అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ పాల్గొని అర్జీలను స్వీకరించారు. వడ్డేశ్వరంలోని మురుగుడు హనుమంతరావు కాలనీ, రాధారంగా నగర్‌లో 20 ఏళ్లగా నివాసం ఉంటున్నామని, పట్టాలు అందించాలని స్థానికులు కోరారు. తహసీల్దార్‌కు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సదస్సులో 37 అర్జీలు వచ్చాయి.

● పెదకాకాని మండలం నంబూరు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సదస్సులోనూ అదనపు సీసీఎల్ఏ, కలెక్టర్, జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సుల్లో నిషేధిత భూములు జాబితా సమస్యలు, మ్యుటేషన్, అడంగల్, సర్వే, భూ రికార్డుల్లో సవరణలకు సంబంధించి అర్జీలను స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదస్సులో గ్రామానికి సంబంధించిన అన్ని భూ రికార్డులు ప్రదర్శిస్తామని ప్రజలు వాటిని పరిశీలించి సవరణలు ఉంటే అర్జీ దాఖలు చేస్తే విచారించి అధికారులు పరిష్కరిస్తారన్నారు.

రైతుల నిరుత్సాహం..

తెనాలి మండలం నందివెలుగులో ఉదయం గ్రామసభకు రావాల్సిన ప్రత్యేకఅధికారి బి.ఉదయ్‌కుమార్ మధ్యాహ్నం 3 గంటలకు హాజరయ్యారు. ఎన్నోఏళ్లగా ఉన్న భూముల సమస్యలు పరిష్కారానికి చక్కటి అవకాశం దొరికిందని రైతులు ఆనందంతో సభకు వస్తే అక్కడ ప్రధాన అధికారులే లేకపోవడం, ఎప్పటిలాగా వీఆర్వోలు, వీఆర్ఏలే దర్శనమివ్వడంతో రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామ సచివాలయంలో సబ్‌కలెక్టర్ సంజనాసింహ్హా ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. 17 మంది భూ సంబంధిత సమస్యలను అర్జీల రూపంలో నివేదించారు. వీటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు.



తెనాలి: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, పక్కన సబ్‌కలెక్టర్ సంజనాసింహ్హా

10

స్పా ముసుగులో వ్యభిచారం

- 17 మసాజ్ సెంటర్లలో పోలీసుల ఆకస్మిక దాడులు
- పోలీసుల అదుపులో థాయ్ ల్యాండ్, నార్త్ ఇండియా యువతులు

గంజాయి, ఎర్ర చందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడి

దటీజ్.. లోకేశ్

- ప్రజాదర్బార్ దిగ్విజయంగా 50 రోజులు పూర్తి
- ఇప్పటివరకు వచ్చిన వినతులు 5810
- పూర్తిగా పరిష్కారం చూపినవి 4400



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

సరికొత్తగా.. బడి పండుగ



సమావేశం కోసం సర్వాంగ సుందరంగా ఏర్పాటుచేసిన మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం

- నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్-టీచర్ మీట్
- చారిత్రక కార్యక్రమానికి వేదికగా బాపట్ల హైస్కూల్
- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్
- విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకం కానున్న సీఎం
- తల్లిదండ్రులకు పాఠశాలల్లో ఆటల పోటీలు.. భోజన ఏర్పాట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) సరికొత్తగా.. తొలిసారిగా.. ఆహ్లాదకర వాతావరణంలో, హంగు ఆర్భాటాలు లేకుండా, రాజకీయాలకు అతీతంగా, పూర్తిగా విద్యా సంబంధమైన వాతావరణంలో, ఆత్మీయ వాతావరణంలో, విద్యార్థులను ఉత్తేజపరిచేలా బడి పండుగ జరగనున్నది. మెగా పేరెంట్-టీచర్ మీట్ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించే సరికొత్త చరిత్రకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఢిల్లీ మినహా మిగిలిన ఏ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమం జరిగిన దాఖలాలు లేవు. ఏపీలో ఇలాంటి వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. శనివారం జరగబోయే ఈ కార్యక్రమానికి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా మారనుండగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తొలిసారి బాపట్ల జిల్లాకు రానుండటంతో పాటు ఓ మెగా కార్యక్రమానికి బాపట్లను వేదిక చేసుకోవడం విశేషం. పూర్తి ఆహ్లాదకర వాతావరణంలో పేరెంట్-టీచర్ మీట్ జరిపేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర అంశాలకు అవకాశం లేకుండా అంతా విద్యా సంబంధమైన వాతావరణమే కనబడేలా అధికారులు చర్యలు చేపట్టారు. హైస్కూల్ విద్యార్థులతో సీఎం మమేకమై వారికి భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయనున్నారు. తల్లిదండ్రులతో ముఖాముఖిలో ఇంటి దగ్గర పిల్లలకు కల్పించాల్సిన వాతావరణంతో పాటు ఉపాధ్యాయులతో క్రమం తప్పకుండా సమావేశమై విద్యార్థి ప్రోగ్రెస్ గురించి తెలుసుకోవాలని కూడా వారికి సూచించనున్నారు. హైస్కూల్‌లో భోజనాలకు ప్రత్యేకంగా కుటీరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లులకు నిర్వహించే ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేయగా తండ్రులకు టగ్గాఫ్‌వార్ నిర్వహించేందుకు క్రీడా వికాస కేంద్రాన్ని ముస్తాబు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

బాపట్లలో ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి అధికారి విధులను సమర్థంగా నిర్వహించాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఎస్పీ తుషార్‌డూడీ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించి బందోబస్తు విధుల గురించి దిశనిర్దేశం చేశారు. హెలీప్యాడ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్‌ను ఎస్పీ నిర్వహించారు. హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాట్లను విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సమగ్రశిక్షాభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిశీలించారు. బాపట్ల హైస్కూల్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా...

ఉదయం 10:20 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్న చంద్రబాబు అక్కడ ఐదు నిమిషాలు మాత్రమే నేతలతో మాట్లాడనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 10:30కు హైస్కూల్ చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1:30 వరకు మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో పాల్గొననున్న చంద్రబాబు 1:40కి తిరుగు పయనమై ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

మధురానుభూతిని మిగిల్చేలా..

మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అంతా ఒకే వేదికపైకి చేరడం మొదలు అందరూ కలిసి భోజనం చేయడం వరకు ప్రతిదీ ఓ మధురానుభూతిని మిగిల్చేలా అధికారులు కార్యక్రమం రూపొందించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పూర్వ విద్యార్థుల స్ఫూర్తి గాథలు విద్యార్థులకు తెలియజేసి వారిలో పోటీతత్వాన్ని పెంచనున్నారు. దాతలను కూడా ఈ వేదికపై నుంచి సన్మానించుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరగనున్నది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి పాఠశాలలు సిద్ధమయ్యాయి. అన్ని పాఠశాలల్లో తరగతి గదుల్ని విద్యార్థులు రంగు కాగితాలతో ప్రత్యేకంగా అలకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ వాతావరణంలో వేడుకల్ని నిర్వహించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల్ని, ఎమ్మెల్యేలను కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 6లక్షల మందికిపైగా విద్యార్థులు, 2లక్షలకుపైగా తల్లిదండ్రులు సమావేశాల్లో పాల్గొంటారని విద్యాశాఖ అంచనా వేస్తోంది.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దూడీ

ఓబీసీల కుల గణన చేపట్టేలా చొరవ చూపాలి


ఢిల్లీలో కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు, శ్రీనివాస్‌గౌడ్

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనతోపాటు సమగ్ర కులగణన జరపాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఆంధ్ర, తెలంగాణ ఓబీసీ ప్రతినిధి బృందం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. జనగణనతో పాటు కుల జనగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 5న కులగణన అంశంపై మహా ధర్నాను నిర్వహించామని కేసన తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి రఘుపతి, జ్ఞాన జగదీష్, విక్రమ్ గౌడ్, శ్రీనివాస్, మట్లపూడి పూర్ణచంద్రరావు తదితరులున్నారు.

ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో మరొకరు అరెస్టు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐసీఐసీఐ బ్యాంకు కుంభకోణం కేసులో మరో నిందితుడిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఎనిమిదో నిందితునిగా ఉన్న చిలకలూరిపేటకు చెందిన కొర్నెపాటి ప్రభు శేఖర్ (ఎ8)ను శుక్రవారం సీఐడీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కేసులో ప్రధాన నిందితుడైన దూడ నరేష్ చంద్రశేఖర్ పరారీలో ఉన్నారు. ఆయన కోసం ఇప్పటికే సీఐడీ బృందాలు కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో జల్లెడ పట్టాయి. చంద్రశేఖర్ చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడలోని భారత్ నగర్ బ్రాంచ్‌లలో మేనేజర్‌గా పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున ఖాతాదారులకు సంబంధించిన బంగారు ఆభరణాలను అపహరించి వేరే బ్యాంకులలో తాకట్టు పెట్టుకోవడం, అదేవిధంగా వారి పేర్లతో రుణాలు తీసుకోవడం వంటి నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తద్వారా సుమారు రూ. 150 కోట్లకు పైగా కొల్లగొట్టినట్లు ప్రాథమికంగా ఇప్పటికే అధికారులు నిర్ధారణకు వచ్చారు. గతంలో ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేసిన సమయంలో ప్రభుశేఖర్‌కు చంద్రశేఖర్ పరిచయం అయ్యాడు. ఆయా బ్రాంచీలలో కొల్లగొట్టిన డబ్బులతో ప్రభుశేఖర్, ఆయన తమ్ముడు, తల్లి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచి వారి పేర్లతో వివిధ కంపెనీలు స్థాపించి వ్యాపార కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించారు. ఇప్పటికే అరెస్టు అయిన అన్నం హరీష్ పేరుతో పెద్ద ఎత్తున బ్యాంకులలో బంగారం తాకట్టు పెట్టడం, అదేవిధంగా లాకర్లలో దాచడం వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించిన అధికారులు ఆయా ఖాతాలు సీజ్ చేసేందుకు ఇప్పటికే సంబంధిత బ్యాంకులకు లెటర్లు కూడా పంపారు. ఈ కేసులో ఇప్పటి వరకు సీఐడీ అధికారులు సుమారు 15 మందిని నిందితులుగా గుర్తించారు. అయితే కేసులో ప్రధాన నిందితుడైన మేనేజర్ నరేష్ చంద్రశేఖర్ పట్టుబడితే గాని కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

● రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు


కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడికి, అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన సమగ్ర శిక్షాభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో కలిసి పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి కాన్వాయ్, ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంపై ట్రయిల్ రన్ నిర్వహించారు. వేదికను పరిశీలించారు. పాఠశాలకు చేరుకోగానే విద్యార్థులే సంప్రదాయ దుస్తులతో ఆహ్వానం పలికేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి: ఐజీ

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి అధికారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శుక్రవారం బాపట్ల విచ్చేసిన ఆయన ఎస్పీ తుషార్‌డూడి, పోలీసు అధికారులకు బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు. ప్రవేశ ద్వారాల వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సంబంధిత ప్రభుత్వ అధికారులు జారీ చేసిన పాస్, ఆహ్వాన పత్రాలు ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హెలీప్యాడ్ వద్ద విధులు నిర్వహించే అధికారులు వారికిచ్చిన జాబితాలో ఉన్నవారిని మాత్రమే క్షుణ్ణంగా తనిఖీ చేసి ముఖ్యమంత్రిని కలవటానికి అనుమతించాలన్నారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయిల్ రన్

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు విచ్చేయుచున్న నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ తుషార్ డూడి హెలీప్యాడ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యే తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వివిధ కార్యక్రమాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు.

స్వల్ప ట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి వచ్చిన కొద్దిసేపు మాత్రమే తాత్కాలికంగా ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

● చీరాల నుంచి బాపట్ల మీదగా పొన్నూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు అంబేద్కర్ సర్కిల్, జమ్ములపాలెం ఫ్లైఓవర్, ఉప్పరపాలెం, ఇందిరాగాంధీ సర్కిల్, దర్గామీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

● బాపట్ల నుంచి కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె వైపు వెళ్లే వాహనాలు గడియార స్తంభంసెంటర్, జాతీయ రహదారి 216 మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

● ఉప్పరపాలెం రైల్వేగేటు, ఆర్అండ్‌బీ బంగ్లామీదగా మున్సిపల్ హైస్కూల్ వైపు వచ్చే వాహనాలు ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్ నుంచి జమ్ములపాలె ఫ్లైఓవర్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉప్పరపాలెం వెళ్లే వాహనాలను కూడా జమ్ములపాలెం ఫ్లైఓవర్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు.

కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

● రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్


ఆల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేసిన ఆల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలసి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మొదటి ఆల్కలీన్ వాటర్ ప్లాంట్ ఇదేనన్నారు. ప్రజల, విద్యార్థుల, సామాజిక అవసరాల కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కన్నా లక్ష్మీనారాయణను ఆయన అభినందించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు, ఏరియా వైద్యశాలకు ఉచితంగా వాటర్ సరఫరా చేయనుండటం అభినందనీయమన్నారు. తన నియోజకవర్గంలో కూడా ఇలాంటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వెనుకబడిన పల్నాడు అభివృద్ధికి పరిశ్రమలు తీసుకురావాలని కన్నా లక్ష్మీనారాయణ కోరారని, రిలయన్స్ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వందల గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలనేది ముఖ్యమంత్రి నిర్ణయం అన్నారు. దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ ఆస్పత్రి, రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాలకు వాటర్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. త్వరలో నియోజకవర్గమంతా సేవలను విస్తరింప చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి పేరిట ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆల్కలిన్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేయటం అభినందనీయన్నారు. ఈ సందర్భంగా మినీ వాటర్ ట్యాంకులను స్కూల్ ప్రధానోపాధ్యాయులకు మంత్రి, ఎమ్మెల్యే, అతిథులు అందించారు. దాతల సహకారంతో అర్బన్ హెల్త్ సెంటర్లకు ఇన్వర్టర్లు, కుర్చీలు, బెడ్ షీట్లను మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందించారు. దాతలను అభినందించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ కన్నా నాగరాజు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, నూర్ బాషా, జాన్ బాబు, ఎంఈవో శ్రీనివాసరావు, ఆతుకూరి శ్రీనివాసరావు, బండారు నాగరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, ఆళ్ళ అమరేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, మక్కపాటి రామచంద్రరరావు, పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులకు మద్దతు ధర ప్రకారం సొమ్ములు వేగంగా వారి ఖాతాల్లో జమవుతున్నాయి. శుక్రవారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 5,731 మంది రైతుల నుంచి 40,811 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. రూ.94.01 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 1,67,299 మంది రైతుల నుంచి 11,63,510 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 5.22 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగా.. ఈ ఏడాది 11 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారని, ర్యాండమైజేషన్ పేరుతో నిర్దేశించిన మిల్లులకే తరలించాలనే నిబంధన వల్ల ధాన్యం తరలింపు రైతులకు తలకుమించిన భారంగా పరిణమించిందన్నారు. ధాన్యం సంచుల కోసమే రోజుల తరబడి రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి గత ప్రభుత్వంలో ఉండేదన్నారు. అయినప్పటికీ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి లారీల్లో సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు తరలించినా.. రోజుల తరబడి దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. పైగా తేమ శాతం పేరుతో మిల్లర్లు భారీగా కోతలు విధించడం, ఆ తరుగుకు సమానమైన సొమ్మును రైతులు ముందుగా చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం.. ఇలా అడుగడుగునా సాగిన దోపిడీతో రైతులు నష్టపోయారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు రెండు, మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిందన్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో సమూల మార్పులు చేసిందన్నారు. ర్యాండమైజేషన్ నిబంధనను తొలగించి రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలోని ఏ రైసు మిల్లుకైనా తరలించుకునే సౌలభ్యం కల్పించిందని మంత్రి చెప్పారు. మద్దతు ధర ప్రకారం 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్టు వివరించారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మన్యం జిల్లాలతోపాటు కోస్తాలోని తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని నాదెండ్ల తెలిపారు.

14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 14న దివంగత ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ స్మారక సాహిత్య కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దనరావు శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. "గత నెల 24నాటికి ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75 ఏళ్ల పూర్తయ్యాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను నిర్వహిస్తున్నామని తెలిపారు. "తెలుగు సినీ జగత్తులోనే కాకుండా భారతీయ సినీ రంగంలో ఎన్టీఆర్ ఒక మేరు నగధీరుడు. పౌరాణికం, చారిత్రికం, జానపదం, సాంఘికం... ఇలా ప్రతి పాత్రలోనూ ఆయన మేటి నటుడిగా నిలిచారు. ఒకే సినిమాలో నాయక, ప్రతినాయక పాత్రలు వేశారు. తనను ఎంతో ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయ రంగంలోకి వచ్చిన ఆయన పేదవాడి మనసు తెలిసి వాళ్ల అవసరాలు తీర్చడానికి ఎంతో ప్రయత్నం చేశారు. 40 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానం గురించి... రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టుల అవసరాల గురించి ఆలోచన చేశారు. వజ్రోత్సవ వేడుకలకు ఎన్టీఆర్ కుమార్తెలు, కుమారులు పురందేశ్వరి, రామకృష్ణ, మోహనకృష్ణతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, కృష్ణ, రామానాయుడు కుటుంబ సభ్యులు కూడా హాజరవుతున్నారు. సినీ రంగంలో ఎన్టీఆర్‌తోపాటు కలిసి పనిచేసిన కళాకారులు, టెక్నీషియన్లు, దర్శకులను కూడా ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 14న విజయవాడ శివారులోని పెనమలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఓ రిసార్ట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది" అని జనార్దనరావు వివరించారు. ఎన్టీఆర్ సినీ విశేషాలతో ఒక యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేస్తే రెండున్నర నెలల్లో దానిని 1.26 కోట్ల మంది చూశారని, 27 వేల మంది సబ్‌స్క్రయిబ్ చేశారని చెప్పారు. మన దేశం నుంచి మొదలుకొని ఎన్టీఆర్ నటించిన మూడు వందల సినిమాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 'తారక రామం' పేరుతో ఒక పుస్తకాన్ని వజ్రోత్సవ వేడుకలో విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగునాట ఎన్టీఆర్ స్మృతి చిరస్థాయిగా ఉండటానికి హైదరాబాద్‌లో ఆయన 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి అక్కడ ఆయనకు సంబంధించిన విశేషాలతో డిజిటల్ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామని జనార్దన్ చెప్పారు.

అక్రమ ఓడీల వ్యవహారంపై డీపీటీవో సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా మంజూరు చేసిన అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ (ఓడీ)ల వ్యవహారంపై జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎమ్.రవికాంత్ సీరియస్ అయ్యారు. విభజిత జిల్లాలో అనర్హులకు అక్రమంగా ఓడీలు మంజూరు చేయటంపై 'ఓడీతో ఎంజాయ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనం ఆర్టీసీ వర్గాల్లో కలకలం రేకెత్తించింది. కథనంపై స్పందించిన డీపీటీవో డిపోల వారీగా ఓడీల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా దీనిపై కొన్ని డిపోల్లో అధికారులు అక్రమ ఓడీల వ్యవహారంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఎవరెవరికి ఎందుకు ఓడీలు మంజూరు చేయాల్సి వచ్చింది వంటి అంశాలపై ఏం చెప్పాలో తెలియక నానా హైరానా పడుతున్నట్లు తెలిసింది. అయితే కథనంపై ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్ స్పందించింది. అక్రమ ఓడీల వ్యవహారంలో వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్‌కు సంబంధించిన సభ్యులు ఎవరూ లేరని యూనియన్ రీజనల్ అధ్యక్షుడు వైవీ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగు సంస్కృతిని విస్మరించవద్దు

●ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు


గరికపాటి నరసింహారావుకు ఘన సన్మానం

వట్టిచెరుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతిని, సంప్రదాయాలను విస్మరించవద్దని ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచించారు. వట్టిచెరుకూరు మండలం, వింజనంపాడు గ్రామంలో, కోదండ రామస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలలో రెండో రోజున ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి యువత పాశ్చాత్య సంప్రదాయాలకు అలవాటు పడి మన సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు, గురువు అనే పెద్దల మాటను పాటించాలన్నారు. తల్లిదండ్రుల మాటను దాటడు కనుకే శ్రీరామచంద్రుడు ఆదర్శప్రాయుడుగా చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రతి పురుషుడు తమ భార్యకు గౌరవం ఇవ్వాలన్నారు. ఆమెతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని అప్పుడే కుటుంబ వ్యవస్థ నిలుస్తుందని అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 12వేలకు పైగా పద్యాలను రచించానని అందులో నా భాగ్యసామిపైన కూడా కొన్ని పద్యాలను రచించానని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతి కుటుంబ వ్యవస్థపై ఆధారపడిందని దీని వెనుక గృహిణులే ఉన్నారని ఆయన ప్రవచించారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు చిరుమామిళ్ల వెంకటరత్నం, కిట్స్ కళాశాల చైర్మన్ కోయా సుబ్బారావు, కార్యదర్శి కోయా శేకర్, ఉగ్గిరాల సీతారామయ్య, రాయపాటి సత్యనారాయణ, గ్రామస్తులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందే

● పిటీషన్‌లో పేర్కొన్న సీసీఐ మాజీ మేనేజర్ సాయి ఆదిత్య

గుంటూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీఐ అధికారులు, బయ్యర్లు, వ్యాపారులకు పెనుసవాల్ ఎదురైయింది. సీసీఐ మాజీ మేనేజర్ గోగినేని సాయి ఆదిత్య కమల్ దేవ్ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 2న అదే విషయాలను ప్రస్తావిస్తూ హైకోర్టులో కేసు వేశారు. జాయింట్ కలెక్టర్ నోటీపై చేసిన తర్వాత సీసీఐ కేంద్రాలు బహిరంగ ప్రదేశాలుగా పరిగణించాల్సి ఉంటుందని పిటీషన్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. బహిరంగ ప్రదేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం-2013ను అనుసరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి సాయి ఆదిత్య పంపిన పిటీషన్‌పై గుంటూరు జిల్లా కలెక్టర్ విచారణ జరిపి సమాధానం ఇచ్చారు. సీసీఐ కేంద్రాల్లో ఎనలిటికల్ టూల్స్‌తో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తీరా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నది మాజీ మేనేజర్ సాయి ఆదిత్య వాదన. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. మార్కెటింగ్ శాఖ చెప్పినట్లు మిల్లుల యజమానులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కాకుండా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయాలని పిటీషన్ వేశారు.

సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్య సహిత శ్రీ అభయ హస్త శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హైకోర్ట్ జడ్జి జస్టిస్ వి.శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. మండలంలోని పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలో కొలువుదీరి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీస్సులు అందించారు. డీఎస్పీ జనార్దన్‌రావు, సీఐ బెల్లం శ్రీనివాసరావు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్ ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బు సంపాదించడం కంటే కూడా సంపాదించిన దానిని కాపాడుకోవడమే గగనమవుతుందని వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌వీఎన్ కాలనీ ఏడో లైన్లో గల పార్కు వద్ద వారధి కార్యక్రమం నిర్వహించారు. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోజుకు ఒక రకమైన సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఆయా నేరాల బారిన పడకుండా ఉండాలంటే వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించేవారు సెల్‌ఫోన్‌లోకి వచ్చే సందేశాలు, కాల్స్‌కు స్పందించవద్దన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా నేరుగా 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఫోన్ చేసిన వెంటనే సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకుంటారు అన్నారు. అదేవిధంగా ఈవ్‌టీజింగ్ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96,104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాతగుంటూరు బావోజీ మఠం, వినోబానగర్, బాలాజీనగర్, ఆలీనగర్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

9న అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 9వ తేదీన బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు స్పాట్ రిజిస్ట్రేషన్, స్పాట్ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. మాప్ అప్ కౌన్సెలింగ్ తరువాత మిగిలిన సీట్లను ఈ ప్రక్రియలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏఎన్ జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు.

8న జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ది ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి వెంకట్ గురుదత్, ఎన్ రామసీత ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలబాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న బోస్టన్ ఫ్రీ ఎడ్యుకేషన్ కన్సల్‌టెన్సీలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 93300 05555, 93985 06170 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

8న రాష్ట్ర స్థాయి చదరంగపు పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నైట్స్ క్యాసిల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 8న స్థానిక జేకేసీ లా కళాశాలలో ఏపీ స్టేట్ చెస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అదే రోజున ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని అన్నారు. ఇతర వివరాలకు 90631 42105, 92471 53387 అనే నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రామ్ కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ ప్రవేశానికై ఈ నెల 22న అర్హత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన 250 మంది అభ్యర్థులకు గుంటూరు జిల్లా, పెదపరిమి గ్రామంలోని రాంకీ ఫౌండేషన్ నైపుణ్య కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 90007 97789, 73375 85959 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న పాశం రామారావు, ఈమని అప్పారావు తదితరులు

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీలలో జరిగే సీపీఎం జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, డీ రమాదేవి, ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు పాల్గొం టారని చెప్పారు. కార్యక్రమంలో ఈమని అప్పారావు, ఎన్. భావన్నారాయణ, కె నళినీ కాంత్, బైరగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు



ఎమ్మెల్యే యార్లగడ్డను శ్రీవారి చిత్రపటంతో అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు త్రినాథ్‌రెడ్డి, బాలాజీప్రసాద్ తదితరులు

గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే యార్లగడ్డ నియామకంపై హర్షం

గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎన్‌టీయూసీ అనుబంధం) కు గౌరవాధ్యక్షుడుగా నియమితులైన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావుకు జిల్లాకు చెందిన అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే బాలాజీప్రసాద్, నాయకులు అభినందనలు తెలియజేశారు. విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ ఆప్కాబ్‌తో సమానంగా కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఉద్యోగులకు వేతనాలు సాధించేందుకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షుడుగా యార్లగడ్డ వెంకటరావు నియామకం హర్షణీయమన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అంబేద్కర్ 68వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్య క్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్ఓ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు. స్థానిక పట్టాభిపురం లోని రైల్ వికాస్ భవన్‌లో మహాపరినిర్వాణ్ దినాన్ని పాటించారు. ఈ సందర్భంగా గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెం బరు 6న అంబేద్కర్ వర్ధంతిని మహాపరినిర్వాణ్ దినంగా పాటిసున్నట్లు చెప్పారు. సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే సైమన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. స్థానిక లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, మంగళదాస్ నగర్ రెండో లైనులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గుంటూరులోని కార్యాలయంలో, టీడీపీ జిల్లా కార్యాలయంలో డేగల ప్రభాకర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆధ్వర్యంలో టీడీపీ నేతలు నివాళులు అర్పించారు. సమానత్వం కోసం త్యాగాలతో కూడిన పోరాటం చేసిన వీరుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి, టీఎన్‌టీయూసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు, తెలుగు యువత నేత షేక్ బాజీ, నైజాం బాబు, మన్నవ రఘు, సయ్యద్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నూరి ఫాతిమా, రాజీవ్‌గాంధీభవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, పొన్నూరు రోడ్డులోని విద్యుత్‌భవన్‌లో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్ చార్జి ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కే సారధి, చంద్రశేఖర్‌లు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సంఘం నాయకులతో కలిసి నివాళులర్పించారు. బహుజన మహాసభ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట స్టేషన్ నుంచి లాడ్జి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వైకే, బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, ఏపీ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి



జిల్లా టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి విముక్తి చిరుతల కక్షి(వీసీకే) పార్టీ మహిళా అధ్యక్షురాలు కే జయసుధ నివాళులర్పించారు.



వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులతో ఎస్పీ సతీష్ కుమార్, ట్రైనీ ఎస్పీ, అధికారులు

నిస్వార్థ సేవకులు హోంగార్డులు: ఎస్పీ

● ఘనంగా హోంగార్డుల 62వ వ్యవస్థాపక దినోత్సవం

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజ నిస్వార్థ సేవకులు హోంగార్డు లని ఎస్పీ సతీష్ కుమార్ కొనియాడారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం హోంగార్డుల 62వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, హోమ్ గార్డ్స్ ఆర్ఐ శివరామకృష్ణల పర్యవేక్షణలో జరిగిన కవాతుకు హోంగార్డు మహమ్మద్ సందాని కమాండర్‌గా వ్యవ హరించారు. ఈ సందర్భంగా హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన.. కవా తును పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు, సంఘ విద్రోహశక్తుల అణిచివేసే సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు వంటి సంభవించినప్పుడు పోలీసు బలగాలతో పాటు సమానంగా ప్రజారక్షణ, సమాజ శ్రేయస్సు కోసం హోంగార్డులు ముందుండి నిస్వార్థ సేవలు అందిస్తున్నారన్నారు. సమాజ సేవలో హోంగార్డుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, నేరాల నియంత్రణతో పాటు తదితర అనేక విభాగాల్లో హోంగార్డులు సేవలందిస్తున్నారన్నారు. హోంగార్డులు భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలు ప్రజలకు అందించి పోలీసులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హోంగార్డుల నిస్వార్థసేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్య సదుపాయాన్ని అందించాలని నిర్ణయించడం శుభపరిణామం అన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన 12 మంది హోంగార్డులకు ఎస్పీ చేతుల మీదుగా అవార్డులను అందించారు ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన హోంగార్డులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు.కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ దీక్ష, డీఎస్పీలు మల్లికార్జునరావు, జయరాం ప్రసాద్, అజీజ్, సుబ్బారావు, ఏడుకొండలరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ అలహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలజీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని ఏపీయూఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని, పీజీటీలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా యాప్‌లను పూర్తిగా తొలగించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీసీ రెడ్డి, కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు అందే ఫిర్యాదులపై పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులను ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఎండార్స్ మెంట్‌లపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ర్యాండమ్‌గా పీజీఆర్ఎస్‌కి ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌లను పరిశీలించారు. ఫిర్యాదుదారు రీ ఓపెన్ చేసినా లేదా సంతృప్తి చెందని వాటికి విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, ఆ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ఎండార్స్‌మెంట్‌లలో సమగ్ర వివరణ ఉండడంలేదని, విభాగాధిపతులు, క్షేత్ర స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరిస్తే ఆయా సమస్యల పరిష్కారం తేలికవుతుందని సూచించారు. ఈ-ఆఫీస్ ఫైల్ తప్పనిసరిగా విభాగ సూప రింటెండెంట్ ద్వారానే ఫార్వార్డ్ కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగే పేరెంట్స్ మీటింగ్‌కి పాఠశాలల వారీగా సీనియర్ అధికారులకు ఇన్‌చార్జిలుగా విధులు కేటాయించాలని డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావుని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. నాగ మల్లేశ్వరరావు, సిటీప్లానర్ రాంబాబు, సిఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

కలెక్టర్ల సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10, 11 తేదీలలో రాష్ట్ర సచి వాలయం బ్లాక్-5లో జరిగే కలెక్టర్ల సదస్సుకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సదస్సుకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. సీటింగ్, వసతి ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సెక్యూరిటీ, భోజన ఏర్పాట్లపై తీసు కోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. రెండు రోజులపాటు జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశానికి సంబంధించి డ్యూటీలు కేటా యించిన అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, ప్రోటోకాల్ డైరెక్టర్ తాతా మోహన్ రావు, డీఎస్ఓ కోమలి పద్మ, సీపీవో శేషశ్రీ, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస రెడ్డి, డీఐవో బిమల్ కుమార్, తుళ్లూరు తహసీల్దార్ సుజాత, సెక్రటరీయేట్ ప్రోటోకాల్ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

మాలదారులకు అన్నప్రసాదం వితరణ

గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అయ్యప్ప మాలదారులకు ఎమ్మెల్యే నసీర్ శుక్రవారం అన్నప్రసాదాలు వితరణ చేశారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి గుడిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, ఈరంటి వరప్రసాద్, కొనకళ్ల సత్యం, ఎర్రగోపు నాగేశ్వరరావు, సుబ్బా రావు, గుడిమెట్ల దయారత్నం, మల్లెంపూడి శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



మాలదారులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నసీర్

అనధికార వసూళ్లు చేపడితే చర్యలు: ఎమ్మెల్యే మాధవి


గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుబజారులో అనధికార వసూళ్లు చేపడితే చర్యలు తప్పవని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హెచ్చరించారు. స్థానిక కృష్ణానగర్ రైతు బజార్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రైతులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతుబజారులో చెత్త కుప్పలుగా ఉండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తమ పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని, నీళ్ళు నిలిచి చిత్తడిగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతుబజారు రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే విస్తుపోయారు. కొంతమంది రైతుల షాపుల లీజు ముగిసినప్పటికీ ఖాళీ చేయక పోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చే షాపులకు ఎటువంటి అద్దె లేకుండా ఇవ్వాల్సి ఉండగా, రైతు బజార్ అధికారులు అనధికార వసూళ్ళకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కనీస సౌకర్యాలు లేని ఈ రైతు బజార్‌కు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని, కొత్త రైతుబజార్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక డివిజన్ కార్పొరేటర్ మానం పద్మశ్రీ, శ్రీనివాస్ ఉన్నారు.



రైతు బజారులో తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే గల్లా మాధవి

మహానటి సావిత్రికి 'కళాదర్బార్' నివాళి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వెండి తెరపై అనేక పాత్రలకు ప్రాణం పోసిన మహానటి సావిత్రి అని కళాదర్బార్-అమరావతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు కొనియాడారు. సావిత్రి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పొత్తూరి రంగారావు మాట్లాడుతూ తెలుగు దనానికి నిలు వెత్తు దర్పణం సావిత్రి రూపమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సీహెచ్ శోభారాణి, టీ సుధీర్‌బాబు, ఎ సాంబశివరావు, సౌజన్య, రాజశేకర్, ధర్మసింగ్, రాధా పాల్గొన్నారు.



సావిత్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాదర్బార్ సభ్యులు

కాంగ్రెస్ లీగల్‌సెల్ నాయకుడు శ్రీనివాసరావు టీడీపీలో చేరిక

గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళపూరి శ్రీనివాసరావు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఈ మేరకు పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ సమక్షంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఇటీవల ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చి మరోసారి నిరూపించారన్నారు. టీడీపీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

రబీ పంటలకు ఇన్సూరెన్స్ చేయించాలి

గుంటూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేస్తున్న శనగ, మినుము, మొక్కజొన్న పంటలకు క్షేత్రస్థాయిలోని వ్యవసాయ శాఖ సిబ్బంది వెంటనే ఇన్సూరెన్స్ చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు లోని జిల్లా వనరుల కేంద్రంలో ఆర్ ఎస్ కే సిబ్బం దికి శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీ సీజన్ లో ఈ-పంట నమోదు, ఈ- కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ తేజ

కౌలు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వట్లేదు?

● బ్యాంకర్ల తీరుపై జేసీ భార్గవ తేజ అసంతృప్తి

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తుండటంపై జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకర్ల జిల్లా సంప్రదింపులు(డీసీసీ), సమీక్ష కమిటీ(డీఎల్ఆర్సీ) త్రైమాసిక సమావేశం జేసీ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2024-25కు సంబంధించి వివిధ రంగాల్లో బ్యాంకర్లు సాధించిన పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కౌలు రైతులకు రూ.180 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా కేవలం రూ.36.8 కోట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. ప్రాధాన్య రంగానికి సంబంధించి గృహ రుణాల లక్ష్యం రూ.664 కోట్లకు కేవలం రూ. 113.50 కోట్లు(17 శాతం) మంజూరు చేయడాన్ని సమీక్షిస్తూ ఎలాగైనా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. అలాగే రుణం తీసుకున్న ప్రతి ఒక్క రైతుని పీఎంఎఫ్‌బీవై ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద అర్హులను చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ, పీఎం స్వానిధి, ముద్రా రుణాలు అన్నింటికీ సంబంధించి వారంలోగా మిగిలిపోయినవి యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బ్యాంకులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జన సురక్ష పథకాలు పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజనలో అర్హులైన అందరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజనల్ డీజీఎం జవహర్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ నవీన్, నాబార్డ్ డీజీఎం శరత్ బాబు, ఎల్‌డియం మహిపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధి కారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి రవీందర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాఠశాలలను డీఈవో సీవీ రేణుక శుక్రవారం సందర్శించారు. స్థానిక కొత్తపేటలోని ఎస్‌జీఐ న్కె, ఎస్‌జెఆర్ఆర్ మున్సిపల్ స్కూల్స్‌ను సందర్శించారు. అక్కడ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగెస్ కార్డుల్ని పరిశీలించారు. అనంతరం సమావేశానికి హాజరయ్యే అతిథుల కోసం బొకేలు తయారు చేసిన విద్యార్థిని విద్యార్థులను ఆమె అభినందించారు. ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని సమావేశం విజయవంతం చేసేందుకు కృషి చేయాలని హెచ్ఎంలకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాల్లో పండుగ వాతావరణం

● నేడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నేడు నిర్వహించే మెగా టీచర్స్ పేరెంట్ మీటింగ్ కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తరగతి గదుల్ని విద్యార్థులు కలర్‌పేపర్స్‌తో ఆలంకరించారు. పాఠశాలల్లో వేదికలను సిద్ధం చేశారు. షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వివిధ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాల ఆవరణలో టగ్‌ఆఫ్‌వార్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందజేయనున్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాలలోనే భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన టెంట్లు

సీతారామయ్య హైస్కూల్‌కి జాతీయ స్థాయి అవార్డు

● అందరి కృషితోనే ఈ అవార్డు లభించింది: పాఠశాల సెక్రటరీ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌కి జాతీయ స్థాయిలో అవార్డు లభించినట్లు పాఠశాల కమిటీ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు బెస్ట్ అకడమిక్ ఎక్సలెన్స్ స్కూల్,ఎక్సలెన్స్ ఇన్ ఇన్స్పిరేషనల్ లీడర్షిప్,ఎక్సలెన్స్ ఇన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ అనే మూడు కేటగిరీల లో ఆంధ్రప్రదేశ్ లోని సీబీఎస్ఈ పాఠశాలలో టాప్ 10 పాఠశాలలో ఒకటిగా ఈ పాఠశాలకు గుర్తింపు లభించింది. అందుకుగాను ఈటి టెక్ స్టెబిలైజర్ అవార్డు ప్రదానోత్సవం చేసిందన్నారు. ముఖ్యఅతిథులుగా ప్రఖ్యాత రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగు చుక్(లడఖ్), సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మి నారాయణ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితర ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ లోని హైటెక్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ అందరి సమిష్టి కృషి వల్లే తమ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది అని ఆయన తెలిపారు. తమ విద్యాసంస్థను భావి తరాలకు ఆదర్శంగా నిలిచేలా, అత్యుత్తమ ప్రమాణాలను పాటించేలా నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. ఆ శ్రమకు ఫలితమే ఈ జాతీయ అవార్డు అని, ఆ కృషికి కారకులైన పాలకవర్గానికి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, సీనియర్ కోఆర్డినేటర్ దోసకాయల దుర్గాశ్యాం పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న పాఠశాల సెక్రెటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

మోకీలు మార్పిడి అనంతరం రోగి సంతృప్తి ప్రధానం

● ఐఓఏ సదస్సులో డాక్టర్ నరేంద్రరెడ్డి



గుంటూరు మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రాచుర్యం పొందిన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స అనంతరం రోగి సంతృప్తి చెందేలా చూడటమే వైద్యుడి ప్రథమ కర్తవ్యంగా ఉండాలని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. బెంగళూరులో శుక్రవారం ప్రారంభమైన 69వ ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ (ఐఓఏ) జాతీయ సదస్సులో 'ఇన్‌స్టెబిలిటీ ఆఫ్టర్ టోటల్ నీ రీప్లేస్‌మెంట్' అనే అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రసంగించారు. మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో జరుగుతున్న నేపథ్యంలో ఆపరేషన్ అనంతరం రోగి అస్థిరత్వానికి గురికాకూడదని ఆయన అన్నారు. మోకీలు మార్పిడి శస్త్రచికిత్స అనంతరం అతి కొద్ది మంది రోగుల్లో తరచూ కొన్ని సమస్యలు కనిపిస్తున్నాయని ,ఈ అంశంపై తన పరిశోధన, పరిశీలన సుదీర్ఘకాలం కొనసాగిందన్నారు. మోకీలు మార్పిడి ఇంప్లాంట్‌ను అమర్చడం, అవసరం మేరకు ఎముకను కట్ చేయడం అనేది ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. శస్త్రచికిత్స సమయంలో వైద్యులు ఇలాంటి అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, రోగి శరీర తత్వంపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ జాతీయ సదస్సులో ఆరు వేల మంది ఆర్థోపెడిక్ సర్జన్లు హాజరయ్యారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా నాజర్ ఎన్నికపై హర్షం

గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన బందెల నాజర్‌కు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ, న్యాయవాది నారదాసు వీరమణీంద్ర పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం నాజర్‌ను కలిసిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భావిభారత దేశం యువత, విద్యార్థుల చేతుల్లో ఉందని, విద్యార్థి ఉద్య మాల ద్వారానే సమాజంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయన్నారు. నాజర్ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదగటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వీ అరవింద్‌బాబు, అరుణ్‌కుమార్, వలి తదితరులు పాల్గొన్నారు.

దటీజ్.. లోకేశ్..





ప్రజా దర్బార్‌కు హాజరైన బాధితులు

యువనేత మంత్రి నారా లోకేశ్ ప్రజల కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ.... ప్రజాసమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ శుక్రవారంతో 50 రోజులు పూర్తి చేసుకుంది. కష్టమేదైనా మీ వెంట నేనున్నానంటూ... ప్రజాదర్బార్ తలుపుతట్టినవారికి అండగా నిలుస్తున్నారు. వైసీపీ పాలనలో సామాన్యులు పెద్దలు సైతం తామెదుర్కొన్న కష్టాలను మంత్రి లోకేశ్‌కు చెప్పుకునేందుకు వచ్చి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఆనాడు వైసీపీ పాలనలో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకున్న బాధితులను నిర్దాక్షిణ్యంగా బయటకు నెట్టి గేట్లు వేసిన పరిస్థితి. కానీ నేడు లోకేశ్ ఆప్యాయంగా అందరి సమస్యలు వింటూ అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించిన తీరుతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తూ దటీజ్ లోకేశ్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజాదర్బార్ దిగ్విజయంగా 50 రోజులు పూర్తి	ఇప్పటివరకు వచ్చిన వినతులు 5810	పూర్తిగా పరిష్కారం చూపినవి 4400	గల్ఫ్ సమస్యలపై ప్రత్యేక చొరవ

తాడేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 50 రోజుల ప్రజాదర్బార్‌లో ఇప్పటి వరకు వచ్చిన వినతులు 5810 కాగా పరిష్కారమైన వినతులు 4400 లుగా ఉన్నాయి. 1410 విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 75 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయి. విజ్ఞప్తుల్లో 50శాతం వరకు రెవెన్యూ, హోం శాఖకు సంబంధించినవి కాగా తదుపరి వరుసలో మానవనరులు, ఆరోగ్యం, పంచాయితీ రాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకుసంబంధించిన వినతులు ఉన్నాయి. భూ వివాదాలకు సంబంధించి 1585విజ్ఞప్తులు అందగా 1170 సమస్యలు పరిష్కరించారు. 415 పెండింగ్‌లో ఉన్నాయి. హోంశాఖకు సంబంధించి 1276 విజ్ఞప్తులు రాగా 1158 సమస్యలు పరిష్కరించారు. 118 విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగాల కోసం 800 దరఖాస్తులు రాగా అర్హతలను బట్టి 347 మందికి త్వరలోనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. పెన్షన్‌కోసం 350 దరఖాస్తులు రాగా ఆయా సమస్యలు కూడా త్వరలోనే పరిష్కారం చూపనున్నారు.







దివ్యాంగుల సమస్యలను ఆలకిస్తూ..

ప్రజాదర్బార్ ద్వారా పరిష్కరించిన పలు సమస్యలు



కొండపల్లికి చెందిన చుట్టుగుంట శ్రీనివాసరావు తన కుమార్తె మంగళగిరి రత్నాల చెరువులో ఉంటుందని నోస్, ఫేస్ ఇన్ఫెక్షన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వెళితే సమస్య పరిష్కారం కాలేదని మూడు నాలుగు నెలల్లో చూద్దామని చెప్పారన్నారు. విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా మూడు రోజుల్లో సమస్య పరిష్కరించి తన కుమార్తె ఇబ్బంది తీర్చారని చెప్పారు. కాగా ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన ఎస్ సుశాంతి ఓ ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ ద్విచక్రవాహనంపై వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లారు. అప్పటికే ఆమె ఆరు నెలల గర్భవతి. వైద్యసాయం కోసం ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌ను సంప్రదించగా తక్షణమే స్పందించిన లోకేశ్ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఐదు లక్షల సాయం అందించి మహిళ ప్రాణాలు నిలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 35 ఏళ్ల క్రితం తనకు అసైన్డ్ చేసిన 1.04 ఎకరాల భూమిని గణపవరం గ్రామానికి చెందిన జె చంద్రరావు కుటుంబం ఆక్రమించిందని, ఏలూరు జిల్లా రాజవరానికి చెందిన ఎం రాజు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేయగా స్పందించిన లోకేశ్ అధికారులకు విషయం చెప్పగా గ్రామస్తుల సమక్షంలో భూమిని కొలిచి సర్వే చేసి సరిహద్దులు చూపించడంతో సమస్య పరిష్కారమయింది. ఇలా ..... అనేక సమస్యలను మంత్రి లోకేశ్ పరిష్కరించడంతో ప్రజలు లోకేశ్ మా భరోసా అంటున్నారు.

గల్ఫ్ బాధితుల జీవితాలలో వెలుగులు నింపిన లోకేశ్

బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన వారికి నేనున్నాంటూ మంత్రి లోకేశ్ అండగా నిలిచారు. చాలీ చాలని జీతాలతో అక్రమ నిర్బంధానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను స్వస్థలాలకు చేర్చాలని సోషల్ మీడియా వేదికల ద్వారా బాధితులు చేసిన విజ్ఞప్తులతో మానవత్వంతో స్పందించారు. గల్ఫ్‌లో చిక్కుకున్న దాదాపు 21మందిని రాష్ట్రానికి ర్పించి వారి కుటుంబాలలో వెలుగులు నింపడం గొప్పవిషయంగా ప్రజలు హర్షిస్తున్నారు. ముగిసిపోయిందనుకున్న తమ జీవితానికి మంత్రి లోకేశ్ ప్రాణం పోశారంటూ గల్ఫ్ బాధితులు కన్నీటితో లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా.... అనేక విజ్ఞప్తులు పరిష్కరిస్తూ వాటిని సంబంధిత శాఖలకు పంపుతూ లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ 50 వ రోజుకు చేరుకుని ప్రజల మన్ననలు పొందింది.

విదర్భ 203 పరుగులకు ఆలౌట్



ధ్యాన్ (3 వికెట్లు)

మంగళగిరి, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కర్ణాటక, విదర్భ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో శుక్రవారం ప్రారంభమైంది. విదర్భ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 77.5 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌటయింది. విదర్భ బ్యాటర్లు కుష్ శర్మ 49, శైష్ భిసే 45, ఓం థోత్రే 40 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు ధ్యాన్ హిరేమత్ 3 వికెట్లు, సుజిత్ వేళన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి పది ఓవర్లలో వికెట్ నష్టానికి 31 పరుగులు చేసింది.

స్పా ముసుగులో వ్యభిచారం



- 17 మసాజ్ సెంటర్లలో పోలీసుల ఆకస్మిక దాడులు
- పోలీసుల అదుపులో థాయిల్యాండ్, నార్త్ ఇండియా యువతులు
- ఆయా సెంటర్లలో ఏర్పాట్లతో షాక్‌కు గురైన పోలీసులు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్ల ముసుగులో గుంటూరు నగరంలో సాగుతున్న హైటెక్ వ్యభిచారం గుట్టురట్టయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి తనయుడు గుంటూరు కేంద్రంగా పలు స్పా సెంటర్‌లు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులకు తెలిసినప్పటికీ ఆయా సెంటర్ల వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఆయా మసాజ్ సెంటర్లకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విటులు క్యూ కట్టారు. ఈ విషయంపై నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నగర పరిధిలోని సుమారు 17 మసాజ్ సెంటర్లలో దాడులకు ఆదేశాలివ్వగా శుక్రవారం ఆయా పోలీస్ బృందాలు ఏకకాలంలో మసాజ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించాయి. పట్టాభి పురం, అరండల్‌పేట, నల్లపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని మసాజ్ సెంటర్లలో ఈ దాడులు సాగాయి. లక్ష్మీపురంలోని తుర, అయాన్, స్థంబాలగరువు సమీపంలోని స్టూడియో 11, బ్రాడీపేట 4/13 లోని కుకుంబర్, బృందావన్ గార్డెన్స్‌లోని మై స్పా, సాయిబాబా రోడ్డు సమీపంలోని యూని వర్శల్, కళ్యాణ్ రోడ్డులో గల ఎస్‌బీసీసీ స్పా, మారుతి నగర్ ఆర్చ్ సెంటర్లోని టూనీ అండ్ గైస్ సెంటర్ లతోపాటు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో, అమరావతి రోడ్‌లోని మరికొన్ని స్పా సెంటర్‌లపై పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ లతోపాటు సంబంధిత సీఐలు, ఎస్ఐలు బృందాలుగా ఈ దాడులు నిర్వహించారు.



తుర మసాజ్ సెంటర్‌లో థాయ్ యువతులను విచారిస్తున్న ఏఎస్పీ సుప్రజ, సీఐ వీరాస్వామి

తుర స్పా సెంటర్‌లో హైటెక్ వ్యభిచారం ..

లక్ష్మీపురం మెయిన్ రోడ్డుపై ఉన్న తుర స్పా సెంటరులో నిబంధనలకు విరుద్ధంగా అనేక సౌకర్యాలు కల్పించారు. ఆయా సదుపాయాలను పరిశీలించిన పోలీసులు షాక్ కు గురయ్యారు. ఈ స్పా సెంటర్‌లోకి వెళ్లాలంటే బిల్డింగ్ పార్కింగ్‌లో ఉన్న లిఫ్ట్ ద్వారా మాత్రమే పైకి వెళ్లాలి. దీనికి అన్ని వైపులా సీసీ కెమెరాలు అమర్చారు. స్పా సెంటర్లో ఉన్న నిర్వాహకులు ఆయా సీసీ కెమెరాల ద్వారా ఈ సెంటర్ లోకి వచ్చే వారిని ముందుగానే పసిగడతారు. అంతేగాక ప్రత్యేకంగా సమాచారం ఇవ్వడానికి ఇక్కడ ఒకరిని నియమించుకున్నారు. అంతేగాక వారందరి వద్ద వాకి టాకీ ఫోన్‌లు ఉండడం గమనార్హం. అంతేగాక నిబంధనలకు విరుద్ధంగా ఈ సెంటర్‌లో మంచాలు, పరుపులు ఏర్పాటు చేశారు. పోలీసులు దాడిచేసిన సమయంలో కొన్ని గదులకు బయట నెంబర్ లాక్ చేశారు. పోలీసులు బలవంతంగా వారి ద్వారా లాక్ తెరిపించారు. ఆయా గదుల్లో అమ్మాయి, అబ్బాయి జంటలు ఒంటిపై దుస్తులు లేకుండా పోలీసులకు పట్టుబడ్డారు. మసాజ్‌కు సంబంధం లేని పలు క్రీములను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సెంటర్లో థాయిలాండ్‌కు చెందిన నలుగురు, నార్త్ ఇండియాకి చెందిన ముగ్గురు యువతులు ఉన్నారు. వారితో పాటు చీరాల పరిధిలోని ఈపూరుపాలెంకు చెందిన పడవల ప్రభాత్, అతిధి వెంకటేశ్వరరావు, చిలకలూరిపేటకు చెందిన తుమ్మల హరీష్ అనే విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా స్పా సెంటర్ మేనేజర్ అయిన కిరణ్ కుమార్‌ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ స్పా సెంటర్ బెంగళూరుకు చెందిన ఆసిఫ్ నిర్వహిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ తుర సెంటర్‌లో సిసిఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, అరండల్ పేట సీఐ వీరాస్వామి, సిబ్బంది దాడి చేశారు. ఈ సెంటర్ నుంచి ఏడుగురు యువతులు, ముగ్గురు విటుల తోపాటు మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్ లోని మసాజ్ సెంటర్లలో సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు మసాజ్ సెంటర్లలో కార్యకలాపాలు అనుమానాస్పదంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ దాడుల సందర్భంగా వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు లభ్యం కాలేదు.


గంజాయి, ఎర్ర చందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

మంగళగిరి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా వుంచామని, పట్టుబడిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరా లను మంగళగిరి సర్కిల్ కార్యాల యంలో శుక్రవారం ఎస్పీ సతీశ్‌కుమార్ మీడి యాకు వెల్లడించారు. తమిళనాడు నుంచి అస్సాం, గౌహతి, పశ్చిమ బెంగాల్‌లోని సిరు గురి మీదుగా ఎర్ర చందనం అక్రమ రవాణా జరుగుతున్నట్టు నిఘా వర్గాల నుంచి సమా చారం వచ్చిందన్నారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ వెంకట్‌లు సిబ్బందితో కలిసి ఈ నెల 4వ తేదీన కాజ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా.. తమిళనాడుకు చెందిన టీఎన్52 హెచ్ 6683 నెంబరు గల పది చక్రాల లారీలో ఏ4 పేపర్ బండిల్స్ మధ్యలో ఎర్ర చందనం వున్నట్టుగా గుర్తించారని తెలిపారు. నిందితులు ఇద్దరు లారీని వదిలి పారిపోయారన్నారు. లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో దుంగలను తూకం వేయగా 1201.87 కిలోల బరువు గల 49 దుంగలు లభించాయని, వీటి విలువ బహి రంగ మార్కెట్‌లో సుమారు రూ.3.5 కోట్లు వుంటుందని తెలిపారు. నిందితుల కోసం గాలింపు చేపట్టగా తమిళనాడు రాష్ట్రం నామకల్ జిల్లాకు చెందిన సారతి కన్నన్, చెన్నయ్‌కు చెందిన జోయ్ ప్రవీణ్‌లను గురువారం అదుపులోకి తీసుకొని నిందితులపై అటవీ పరిరక్షణ చట్టం, దొంగతనం, ఎర్ర చందనం స్మగ్లింగ్, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. తమిళనాడులోని ఓ వ్యక్తి ఆదేశాల మేరకు డబ్బు ఎక్కువగా వస్తుందన్న ఆశతో ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు నిందితులు తెలిపారన్నారు. కోల్‌కత, గౌహతి, సిరుగురి తదితర ప్రాంతాల మీదుగా చైనా దేశానికి ఎర్ర చందనం అక్రమంగా తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మరింత లోతుగా దర్యాప్తు చేపడతామని ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడిం చారు. ఈ సమావే శంలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఎస్పీలు సీహెచ్ మురళీకృష్ణ, భార్గవి, మంగళగిరి రూరల్, అర్బన్ సీఐలు వై.శ్రీనివాసరావు, డి.వినోద్ కుమార్, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ

10న లలితకళా ఉత్సవం

- డాక్టర్ ఎన్ మంగాదేవి స్వీయకథ పుస్తకావిష్కరణ
- భిన్నరంగాలకు చెందిన ముగ్గురికి సాహిత్య పురస్కారాలు

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న 27వ లలితకళాఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకులు డాక్టర్ నన్నపనేని మంగాదేవి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు నగరంలోని ఏటి అగ్రహారం జీరోలైనులోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగే వేడుకల్లో ముగ్గురు ప్రముఖలకు సాహిత్య పురస్కారాలు అందించనున్నారు. కర్నూలుకు చెందిన ఉపాధ్యాయుడు, బాల సాహితీవేత్త డాక్టర్ ఎం హరికిషన్‌కు మంగాదేవి బాలసాహిత్య పురస్కారం అందిస్తారు. ఇందులో భాగంగా రూ. 25వేలు నగదు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. ఇంకా స్త్రీవాద రచయిత సి సుజాతకు మాలతీ ప్రమదా సాహిత్య పురస్కారం, రూ. 25వేలు నగదు, జ్ఞాపిక అందిస్తారు. వర్ధమాన రచయిత్రి ఎ లక్ష్మీ అహలకు ప్రతిభా పల్లవం పురస్కారంతో పాటు రూ. 10 వేలు నగదు, జ్ఞాపిక అందిస్తారు. వేడుకలకు కేంద్ర సాహిత్య అకాడమి భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవలోలు రామబ్రహ్మం హాజరై పురస్కారాలు పంపిణీ చేస్తారు.



పురస్కారం అందుకోనున్న డాక్టర్ ఎం హరికిషన్

అదే విధంగా శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్ మంగాదేవి స్వీయకథ 'అంకురం నుంచి అనంతం' పుస్తకాన్ని ప్రముఖ రచయిత విమర్శకుడు, చిత్రకారుడు, వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరించనున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు వివిధ విభాగాల్లో బహుతులు అందిస్తారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు

కొత్తగా 53 వేల దరఖాస్తులు

- 6వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లన్నీ పరిష్కారం
- 9వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు దాఖలుకు గడవు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ముసాయిద ఓటర్ల జాబిత ప్రచురణ అనంతరం కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గత నెల 23వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు లిస్టుని ప్రచురించిన తర్వాత ఈ నెల 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు ఎన్నికల సంఘం గడవు ఇవ్వడంతో ఇంకా ఓటరుగా నమోదు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారు. ముసాయిద ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 53 వేలకు పైగా దరఖాస్తులు ఆరు జిల్లాల నుంచి రావడం విశేషం. ఇంకా మూడు రోజుల గడవు సమయం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరో నాలుగు నెలల్లో జరగనున్న కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎవరైతే 2021 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పట్టాని పొంది ఉంటారో వారందరికి ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశం కల్పించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పట్టభద్రులు దరఖాస్తు చేసుకొన్నారు. ఇప్పటికే 2 లక్షల 90 వేల 978 మంది పట్టభద్రులకు ఈ ఆరు జిల్లాల్లో ఓటు హక్కు కల్పించారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీలు సమీపిస్తున్న దృష్ట్యా క్లెయిమ్‌ల సందర్భంగా వస్తోన్న దరఖాస్తులను మరుసటి రోజే పరిశీలన జరిపించి పరిష్కరిస్తున్నారు. ఆ విధంగా శుక్రవారం ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించామని ఈఆర్‌వో ఎస్ షేక్ ఖాజావలి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఓటుహక్కు కోసం ఈ నెల 9 వరకు గడవు ఉన్నందున పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నూతన ఆవిష్కరణలకు సిద్ధంకండి !

- సాంకేతిక విద్యార్థులకు ఎమ్మెల్యే బూర్ల పిలుపు
- నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్ ప్రారంభం



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో వస్తున్న ఆధునిక మార్పుల్ని విద్యార్థులు అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు సిద్ధం కావాలని, ఇందుకు ప్రభుత్వం చేయూత నిస్తుందని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. శుక్రవారం నల్లపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి టెక్‌ఫెస్ట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్య పూర్తిచేసిన వారికి ఉద్యోగ ఉపాధి అవకావాలు విస్తృతంగా ఉన్నాయని, ఇందుకోసం తొలుత ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ టీ.శేఖర్, అధ్యాపకులు, బోధనే తర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 113 వినూత్న ఆవిష్కరణలను విద్యార్థులు ఏర్పాటు చేశారు. నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయం, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

10 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

కాకుమాను, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి మండలంలో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు భూ సమస్యలు పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామల వీఆర్వోలు, పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు
1902 క్యూసెక్కులు..

దుగ్గిరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 190 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 78 పశ్చిమకాల్వకు 73, నిజాంపట్నం కాల్వకు 268, కొమ్మమూరు కాల్వకు 1035 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

122 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 6: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 122 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు విక్రయం జరగలేదు. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 9,400, గరిష్ఠ ధర రూ.11,500, మోడల్ ధర రూ.11,500 పలికాయి.

బాల్యవివాహాల
నిర్మూలనకు కృషిచేద్దాం

పెదనందిపాడు, డిసెంబరు, 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగులపాడు ఎస్టీ కాలనీ, పాలపర్రు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులు, తల్లిదండ్రులు కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. బాలల విద్యను ప్రోత్సహిద్దాం, హక్కులు, చట్టాలు వివరిద్దాం, బాల్యవివాహాలు నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే గ్రామ కమిటీలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం
ఫిర్యాదుపై విచారణ

పెదనందిపాడు, డిసెంబరు, 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పెదనందిపాడు గ్రామపంచాయితీలో గత ప్రభుత్వ హయాంలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ వార్డు సభ్యులు గత నెల 25న ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం డీఎల్పీవో కె శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. దాతలు ఇచ్చిన సర్వే నెం.174-2లో 1.74 ఎకరాల్లో అనుమతులు లేకుండా ఆర్బీకే, డిజిటల్ లైబ్రరీ వంటి బిల్డింగ్‌ల నిర్మాణాలకు రు.7లక్షలతో మెరక తోలారని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద పంచాయతీ తీర్మానం లేకుండానే రు.4.7 లక్షలతో తూములు వేశారని, పాతబస్టాండ్ సెంటర్లో పంచాయతీ అనుమతులు లేకుండానే అంబేద్కర్ కాంప్లెక్స్ నిర్మించి నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన వార్డు సభ్యులను, కార్యదర్శిలను విచారించినట్లు నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

బాలల రక్షణ చట్టాలపై
అవగాహన అవసరం

మంగళగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ కోసం ఉద్దేశించబడిన హక్కులు, చట్టాలను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నిడమర్రు గ్రామంలో కెపాసిటీ బిల్డింగ్ ఆన్ చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీస్ జే.పద్మావతి మాట్లాడుతూ ఆపదలో వున్న బాలికలు, మహిళలు 112 టోల్‌ఫ్రీ నెంబరును ఉపయోగించుకోవాలని, బాలల హక్కుల ఉల్లంఘన జరుగకుండా కృషి చేయాలని కోరారు.

పార్టీలకు అతీతంగా
సమస్యలపై పోరాటం

తుళ్లూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తాడికొండ నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ వనమామా బాల వజ్ర బాబు (డైమండ్ బాబు)అన్నారు. పదవి పగ్గాలు చేపట్టిన తరువాత ఆయన మొదటి సారిగా రాజధాని అమరావతిలో వెంకటపాలెం వెంకటేశ్వరుస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మూడు రాజధానులపై విలేకరులు ప్రశ్నించగా అది 2.019 నుంచి 2024 సంవత్సరం వరకు జరిగిన అంశమని దాని గురించి ఇప్పుడు మాట్లాడుకోవాల్సిన సందర్భం కాదని డైమండ్ బాబు మాట దాటేశారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే
రెవెన్యూ సదస్సులు


ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

- వడ్డేశ్వరం రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి
- తహసీల్దార్ల ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహణ
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

తాడేపల్లి,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి, ఐఎఎస్ అధికారి ఎన్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ భూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించాలని, వీటిని పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి రసీదు అందజేసి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలు సమస్యలను విన్నవించారు. సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి, ఐఎఎస్ అధికారి ఎన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ భార్గవ తేజ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లక్ష్మీకుమారి, తాడేపల్లి తహసీల్దార్ డీ.సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, ప్రజలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

37 అర్జీలు రాక .. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం రెవెన్యూ సదస్సులో మొత్తం 37 అర్జీలు వచ్చాయి. వీటిలో మ్యుటేషన్‌కు సంబంధించి 9, సర్వేకు 6, రెవెన్యూ అంశాలపై 6, సివిల్ సప్లయ్స్‌పై ఒకటి, లాండ్ గ్రాబింగ్‌పై ఒకటి, డూప్లికేట్ పట్టా కోసం 2, ఎంటిఎంసి శానిటేషన్, డ్రైయినేజికి సంబంధించి 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీతారామయ్య తెలిపారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తమల్లాయపాలెంలో ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అందజేసిన అర్జీలను ఆయన స్వీకరించారు. ప్రతి అర్జీని క్షున్నంగా పరిశీలించి పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గాయత్రిదేవి, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ, ఎండోమెంట్ ఈవో వెంకటేశ్వర్లు, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ జీ రామకృష్ణ, వీఆర్వో బాబు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడవర్రు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ ఐ.సునీత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ వరకూ నెల రోజుల పాటు జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూముల సమస్యలను అర్జీ రూపంలో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వృద్ధ రైతు దంపతులను ఆమె ఘనంగా సత్కరించారు. సర్వే, పాస్ పుస్తకాలకు సంబంధించి ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ విశ్వనాధపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ శివకుమార్, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద తహసీల్దార్ జే ప్రసాదరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు రైతులు, ప్రజల నుంచి 43 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో జే శ్రీనివాసరావు, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి షేక్‌మస్తాన్ షరీఫ్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్, వీఆర్‌వోలు, టీడీపీనేతలు పాల్గొన్నారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డమాను గ్రామంలో తుళ్లూరు తహసీల్దార్ జీ.సుజాత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడంగలు, విస్తీర్ణ సమస్యలు, సర్వే చేయాల్సిన పనులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

తాడికొండ,(ఆంధ్రజ్యోతి)మండల పరిధిలోని కంతేరు గ్రామంలో తహసీల్దారు కే.నాసరయ్య అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 17 అర్జీలు వచ్చినట్టుగా తెలిపారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నియోకవర్గ స్పెషాలాఫీసర్ ఎం.గంగరాజు, మండల స్పెలాఫీసర్ కె.జయలక్ష్మీ, ఇన్‌చార్జ్ సర్పంచ్ వీ. విజయరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెంలో భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, రీసర్వేలో జరిగిన వ్యత్యాసాలపై రైతులు అందించిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై 8 దరఖాస్తులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సాహితీమోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంటీఎంసీ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న ఏసీసీ కార్మికులు

ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

మంగళగిరి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సిమెంటు ఫ్యాక్టరీ కార్మిక కుటుంబాలు నష్టపరిహార పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగాయి. తాడేపల్లిలోని సిమెంటు ఫ్యాక్టరీ దీక్షా శిబిరం నుంచి మంగళగిరిలోని ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిబ్బంది గేటుకు తాళం వేయడంతో కొద్దిసేపు కార్మిక కుటుంబాలు అక్కడే నినాదాలు చేశారు. గత నెల 30న ప్రభుత్వ అధికారులు కార్మికుల గుడిసెలను ఎందుకు తొలగించారో కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ప్రధాన గేటును కొద్దిసేపటికి తెరవడంతో ఎంటీఎంసీ కార్యాలయం లోపల బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వేముల దుర్గారావు మాట్లాడుతూ గత 32 సంవత్సరాల నుంచి తమకు రావలసిన నష్టపరిహారం కోసం ఏసీసీ కార్మికులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. 2014లో సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టులు వడ్డీతో సహా చెల్లించాలని యాజమానులను ఆదేశిస్తూ తీర్పు వెలువరించాయని గుర్తుచేశారు. నష్టపరిహార పోరాట సాధన కమిటీ కన్వీనర్ స్టీఫెన్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు, యాజమానులకు అనేకమార్లు తమ గోడు వెళ్లబోసుకున్నా ప్రయోజనం లేకపోవడంతో అనివార్యంగా ఏసీసీ భూముల్లో గుడిసెలు వేయడం జరిగిందన్నారు. ఈ గుడిసెలను అధికారులు ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలన్నారు. కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నేత కే.కోటేశ్వరరావు, సీపీఐ నేత కంచర్ల కాశయ్య, సీఐటీయూ నేతలు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కే.కరుణాకర్‌రావు, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, వై.రమాదేవి, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు
పటిష్ట చర్యలు తీసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏసీ జీఎస్‌ఎస్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి), రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూమిలిచ్చిన రైతులకు ఈ- లాటరీ ద్వారా అందించన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషన్ జీ. సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డే లో రైతులు పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కి విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దారు, ఉప తహసీల్దారు, సబ్‌రిజిస్ట్రార్ అధికారులు రైతులకు అందుబాలో ఉండి, రిజిస్ట్రేషన్‌లను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేటగిరిరి 5, 6 అసైన్డ్ భూముల రైతులకు కేటాయించి తిరిగి ఇచ్చు నివాస, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు సైతం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై, అదనపు కమిషనర్ వారికిచ్చిన సమస్యలలో అధిక శాతం అక్కడకక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటిని సంబంధిత శాఖా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అమరావతిలో భూమి వ్యవహారాలు 45, జామాజిక అభివృద్ధికి చెందిన 1, అమరావతి స్మార్ట్ సిటీ-1, ఇన్‌ఫ్రా 1, భూ సర్వే2 సమస్యలు అందాయి. కార్యాక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెకర్లు, తహసీల్దార్‌లు, భూ సర్వేయర్లు, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని కుటుంబాలకు
వంద రోజులు పని..

ప్రత్తిపాడు, డిశంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాల్సిందేనని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి మండల స్థాయిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అన్ని గ్రామాల వారీగా ఆడిటింగ్ బృందం నిర్వహించిన తనిఖీ నివేదికను చదివి వినిపించారు. గృహ నిర్మాణాలకు సంబందించి ఎన్ఆర్ఈజీఎస్ పనిదినాలు అదనంగా వేయడం, మస్టర్ లేకుండా కూలి సొమ్ము ఇవ్వడం, కొన్ని రికార్డులు తప్పులుగా ఉండటం, కొలతలు తేడా ఉండటం ఈ విధంగా ప్రధానంగా కొన్ని సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సంబందిచి పీడీ శంకర్ సిబ్బందికి సూచనలు చేశారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఎక్కువ వ్రాసిన రోజులను తగ్గించి బిల్లులు చేయాలని సూచించారు. ఎక్కువ కుటుంబాలు పనులకు రాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివన్నారాయణ, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ హనుమంతురావు, జడ్‌పీటీసీ విప్పాళ్ల కృష్ణారెడ్డి, ఎంపీడీవో శివపార్వతి, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, సీవో అరుణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టీడీపీ నేతలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన షేక్ షంషాద్‌కు రూ.1,30,920, ముప్పవరపు శివకుమారికి రూ.67,900, పందిపాటి రవికుమార్‌కు రూ.25,800 చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. తమకు సహాయ నిధి మంజూరయ్యేందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్‌బాబు, మల్లవరపు వెంకట్, కొడవలి ఆనంద్, యెమినేని సుధాకర్, షేక్ బాజీవలి, మొద్దుకూరి రమేష్, కాకర్లమూడి సారంగపాణి, షేక్ బాజీ, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రగ్బీ క్రీడా పోటీలు


రగ్బీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

- అండర్-15 రగ్బీ పోటీల్లో పాల్గొన్న 25 పాఠశాలల క్రీడాకారులు

దుగ్గిరాల, డిసెంబరు6: మండల గ్రామం మోరంపూడిలో జిల్లాస్థాయి రగ్బీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 25 పాఠశాలలకు చెందిన 180 మంది పోటీల్లో పాల్గొన్నారు. మంగళగిరి బాపూజీ విద్యాలయం చైర్మన్ తులసీరామ్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ, క్రీడల ద్వారా ఒత్తిడిని అధిగమించే విధంగా క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతూ, విద్యను అభ్యసించేందుకు ప్రతివిద్యార్థి ఆసక్తి చూపుతారన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రజనీనాయక్ సారధ్యంలో జరిగిన పోటీల్లో బాపూజీ విద్యాలయం పీఈటీ దత్తారావు, అమ్మిశెట్టి గిరిధర్, సీహెచ్ శ్రీదేవి వ్యవహరించగా, పీఈటీలు జ్యోతి, ప్రజ్ఞ, బాలాజీ తదితరులు అంపైర్లుగా వ్యవహరించారు అండర్ -15 సబ్‌జూనియర్ రగ్బీ పోటీల్లో పాల్గొన్న వారిలో 18మంది బాలురు, 18మంది బాలికల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫిరంగిపురం క్రీడామైదానంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో చైర్మన్ తులసీరామ్ తెలిపారు.


ప్రసంగిస్తున్న హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే
ఉజ్వల భవిష్యత్తు

మంగళగిరిసిటీ, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆ రంగంలో లక్ష్య సాధన కోసం కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి అన్నారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని విజ్ఞానవిహార ఇంగ్లీషు మీడియం హైస్కూల్ 34వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అనుశాసనం, తల్లిదండ్రులను గౌరవించడం, దేశ భక్తిని పెంపొందించుకోవడం అలవర్చుకోవాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ పీ.వినోద్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వి.రఘురామ్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, ప్రిన్సిపాల్ సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రత్న ప్రసాద్

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో
ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

తాడేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో శుక్రవారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విభాగ డైరెక్టర్ డాక్టర్ పీ.రత్నప్రసాద్ మాట్లాడుతూ మానవ మనుగడతోపాటు జీవకోటికి నేల-నీరు ఎంతో అవసరమన్నారు. నీరు లేకుండా నేల లేకుండా భూమి మీద జీవరాసులు మనుగడ సాగించడం సాధ్యపడదన్నారు. ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని ప్లాస్టిక్ వ్యర్థాలతో సారవంతమైన నేల కూడా కలుషితమవుతుందన్నారు. నీరుకి మట్టికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. మనిషికి అవసరమైన ఆహారం తయారు కావాలంటే మట్టికి నీటికి అందించినపుడు మాత్రమే ఆ మొక్కలకు జీవం అందుతుందన్నారు. మనిషికి మట్టి-నీరు గొప్ప వరమన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బీ.బాలకృష్ణ మాట్లాడుతూ ఆధునికయుగంలో ఆహార కొరత లేకుండా అందరికి ఆహారాన్ని అందించే బాధ్యత వ్యవసాయ విభాగంపైన ఉందన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే విధంగా కాకుండా వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చేవిధంగా ఆధునిక వ్యవసాయంలో మార్పులు అవసరమన్నారు. ఆ దిశగా పలురకాల పరిశోధనలు ఇప్పటికే వ్యవసాయరంగంలో జరుగుతున్నాయన్నారు. భారతదేశానికి వ్యవసాయమే వెన్నెముక అన్నారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ ప్రపంచంలో ఎక్కడకెళ్లినా ఉద్యోగం సాధిస్తారన్నారు. అనంతరం వ్యవసాయ విభాగ విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జీ. పార్థసారధివర్మ, ప్రోవీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కే.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్ వెంకట్రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముక్కోటి ఉత్సవాలకు
సమన్వయంతో పనిచేద్దాం

మంగళగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జనవరి పదవ తేదీన జరుగనున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి కోరారు. ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో శుక్రవారం దేవస్థానం ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దారు కే.దినేశ్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్తర ద్వార దర్శనం, శంకుతీర్థం క్యూలైన్ల ఏర్పాటు, దర్శనం టిక్కెట్లు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, వైద్య సదుపాయం, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఇందుకోసం ఆయా శాఖల తరపున తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఫైరింజన్, అంబులెన్స్ అందుబాటులో వుంచాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మునిసిపల్, పోలీసు, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి టీడీపీ నేతల నివాళి

రాజ్యాంగ నిర్మాతకు నివాళులు

- వివిధ ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు
- చిత్రపటాలకు, విగ్రహాలకు నేతల, అధికారుల నివాళులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వివిధ రాజకీయ పార్టీలు, దళిత, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి, తాలూకా సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి నేతలు, కార్యకర్తలు నివాళి అర్పించారు. ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, దళితుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారరాంరకె, కార్యక్రమంలో తమ్మిశెట్టి జానకీదేవి, తోట పార్థసారధి, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గుత్తికొండ ధనుంజయరావు, కొదమల సైమన్‌ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతలు జేవీ రాఘవులు, వీసం జవహర్‌లాల్, బాలకృష్ణ బాలాజీ, ప్రజా సంఘాల నేతలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాలలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్దనున్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, ఈవోపీఆర్డీ జవహర్, పంచాయతీ కార్యదర్శి వివేకానంద పాల్గొన్నారు.

కాకుమాను, (ఆంధ్రజ్యోతి): కాకుమాను ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు, సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో, భారత తొలి న్యాయశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్, తోకల సంపత్, నరేంద్ర, జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయంలో.. స్థానిక ఎంఈవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంఈవో కెన్నడీ, విజయ్‌భాస్కర్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎమ్మార్వో కార్యాలయంలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో వెంకట స్వామి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తాడేపల్లి/తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ, మండల టీడీపీ కార్యాలాయల వద్ద రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో, పెనుమాక, ఉండవల్లి, వడ్డేశ్వరం, చిర్రావూరు, గుండిమెడలో టీడీపీ నేతలు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంటీఎంసీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సీపీఐ నేతలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, డైరెక్టర్‌లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తదితరులు

తాడికొండ (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తాడికొండ లోని జయభారత్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బడేపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపీటీసీ దేవదాసు, సెయింట్ పాల్ సొసైటీ అధ్యక్షుడు బెజ్జంసాయి ప్రసాదులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరావు, బీజేపీ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ బిలాల్, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వల్లభనేని వెంకట్రావు తదితరులు

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మందులు తగలబెట్టడంపై విచారణ

ఆంధ్రజ్యోతికి స్పందన

తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తానాబాద్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం గడువు ముగిసిన మందులను తగలబెట్టిన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. అక్కడ వైద్యాధికారినిని విచారించారు. గడువు ముగిసిన మందులను తనకు తెలియకుండా అటెండర్ బయటపడవేసి తగలబెట్టాడని ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని వైద్యాధికారి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణకు వివరించారు.



ఎడ్లబండి కింద పడి వ్యక్తి మృతి

కొల్లిపర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎడ్లబండి కిందపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వల్లభాపురం శివారు యాదవపాలెం గ్రామానికి చెందిన బట్టా మాధవరావు (68) ఇంటి వద్ద నుంచి సెంటర్‌కు వస్తున్నాడు. ఆ సమయంలో ఎదురుగా ఎడ్లబండి వస్తూ ఒక్కసారిగా ఎద్దు బెదిరి అతనిపైకి రావటంతో కాడి తగిలి టైరు బండికింద పడ్డాడు. స్థానికులు వెంటనే 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గమధ్యంలో మాధవరావు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మన్నవ వీఆర్ఏ విద్యార్హతపై ఫిర్యాదు

పొన్నూరు టౌన్, డిసెంబరు 6: మండల పరిధిలోని మన్నవ గ్రామంలో రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్న గోళ్లమూడి కోటేశ్వరరావు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలపై గోళ్లమూడి ముక్తేశ్వరరావు శుక్రవారం తహసీల్దార్ జియావుల్‌హక్‌కు ఫిర్యాదు చేశాడు. గోళ్లమూడి కోటేశ్వరరావు మన్నవ ఎంపీపీఎస్ ఎలిమెంటరీ పాఠశాలలో 391 అడ్మిషన్ నెంబరుతో 1 నుంచి 3వ తరగతి, ఆర్‌సీఎం ఎలిమెంటరీ స్కూల్‌లో అడ్మిషన్ నెం.909తో 4 నుంచి 5వ తరగతి, దొప్పలపూడి జడ్పీ హైస్కూల్‌లో 2383 అడ్మిషన్ నెంబర్‌తో 7వ తరగతి వరకు చదువుకున్నాడు. తర్వాత జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించానన్నారు. అయితే తన అడ్మిషన్ నెం. 391ని మార్చి తన వివరాలను మార్చి గోళ్లమూడి కోటేశ్వరరావు మోసపూరితంగా గ్రామ రెవెన్యూ సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముక్తేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

కోర్టు విధులకు న్యాయవాదుల గైర్హాజరు

తెనాలి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం సర్టిఫికెట్ ప్రాక్టీసు న్యాయవాదులకు ఇబ్బందికరంగా మారడంతో దానిని ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం న్యాయవాదులు విధులకు గైర్హాజరయ్యారు. అదేవిధంగా న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీకి చెల్లించే ప్రీమియం ఎక్కువగా ఉందని, ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఈ రెండు చట్టాలని వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, తలతోటి సుధాకర్, మధిర సురేష్, గంటి సురేష్ కుమార్, కొండయ్య, కిషోర్‌కుమార్, అబ్రహంలింకన్ తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో హనీష్‌కు పతకాలు



తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): రోప్ స్కిపింగ్ నేషనల్ చాంపియన్ షిప్ 2024-2025 పోటీల్లో కనగాల హనీష్ పతకాలు సాధించారు. మండలంలోని అంగలకుదురుకు చెందిన క్రీడాకారుడు హనీష్ నవంబరు 30 నుంచి డిసెంబరు 2 వరకూ గోవాలో ఐఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోప్ స్కిపింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొని అండర్ 14 విభాగంలో సింగల్స్‌లో గోల్డ్‌మెడల్, అండర్ 17 అబొవ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం కుమారుడు హనీష్ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. రోప్ స్కిపింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారుడు హనీష్‌కి శుక్రవారం గణేష్ యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

తెనాలి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత ప్రభుత్వ వైద్యశాలలో లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నలుగురు విద్యార్థులకు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. తెనాలి డబుల్ హార్స్ సహకారంతో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఈ చెక్కులు పంపిణీ చేశారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ, లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబంలో ప్రతిభ చూపే విద్యార్థులకు ఈ సాయం అందజేసినట్లు చెప్పారు. డబుల్ హార్స్ ఫౌండేషన్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. రవికుమార్, రమణయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో హుండీల లెక్కింపు

పెదకాకాని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం హుండీల లెక్కింపు పూర్తయింది. పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ఈవో ఎన్.యల్.టి. సౌమ్య పర్యవేక్షణలో ఆలయ కల్యాణ మండపంలో లెక్కింపు పూర్తి చేసినట్లు ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానానికి గడిచిన 46 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.56,14,083, అన్నప్రసాదవితరణ భవనంలో హుండీ ద్వారా రూ.3,36,386, బంగారం 0.30.900 మి.గ్రా, వెండి 259 గ్రాములు, విదేశీ కరెన్సీ 55 డాలర్లు ఆదాయం వచ్చిందని దేవస్థాన ఉపకమిషనరు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన ఉప కమిషనరు కె.బి.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, కెనరాబ్యాంకు మేనేజరు, సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భూ సంబంధ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత రెవెన్యూ సేవలు, ఫిర్యాదులు ప్రజల వద్దకే వచ్చి పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం పెదకాకాని మండలం నంబూరులో రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులో వ్యవసాయ, నివాస స్థలాలపై రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు, నిషేధిత భూములు జాబితా సమస్యలు, మ్యుటేషన్, అడంగల్, సర్వే, భూ రికార్డులలో సవరణలకు సంబంధించి అర్జీలను స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదస్సులలో గ్రామానికి సంబంధించిన అన్ని భూ రికార్డులు ప్రదర్శించడం జరుగుతుందని, ప్రజలు వాటిని తనిఖీ చేసుకొని వారికి సంబంధించిన భూముల రికార్డులలో సవరణలు ఉంటే అర్జీ దాఖలు చేస్తే విచారించి అధికారులు పరిష్కరిస్తారన్నారు. సదస్సులో రెవెన్యూ శాఖతోపాటు రిజిస్ట్రేషన్, దేవదాయ, జిల్లాలోని 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సదస్సులు జరిగే తేదీకి రెండు రోజులు ముందు నుంచే గ్రామంలో చాటింపుతో ప్రతి ఒక్కరికి తెలియచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ మాట్లాడుతూ ప్రజలకు అతి ముఖ్యమైన భూమికి సంబంధించి సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. జిల్లాలోని 173 గ్రామాల్లో మండలంలో రోజుకో గ్రామం చొప్పున నెల రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. వ్యవసాయ, నివాస భూములపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సదస్సులో అర్జీలు అందిస్తే పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూవివాదాలు, మ్యుటేషన్స్, భూ రికార్డులు సవరణలు తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదుగా గానీ, అర్జీలు అందిస్తే, సదస్సులో ఇచ్చిన అర్జీలకు ప్రభుత్వం యూజర్ చార్జీలు రద్దు చేసినందున ఉచితంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.


నంబూరులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

భూమి రికార్డుల పరిశీలన

పెదకాకాని మండలం నంబూరులో పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పరిశీలించారు. సదస్సులో గ్రామ మ్యాపు అర్జీలు ఆన్‌లైన్ నమోదు గ్రామ రికార్డులను పరిశీలించారు. సదస్సులో ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించి రెవెన్యూ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. గ్రామ రికార్డుల్లోని ఆర్ఎస్ఆర్‌లో ప్రామాణికంగా తీసుకొని అడంగల్ 1బీ ఇతర రికార్డుల్లో భూ యజమానుల వివరాలను పరిశీలించాలన్నారు. వీటిలో ఏమైనా తేడాలు గుర్తించితే అధికారులు సుమోటోగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రికార్డుల్లో సవరణలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాల్సిన అంశాలకు సంబంధించి భూ యజమానులతో అర్జీలు తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సదస్సుల మండల స్థాయి ప్రత్యేక అధికారులు డిజాస్టర్ మేనేజ్మెంట్ జిల్లా మేనేజర్ లక్ష్మీకుమారి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు

● తెనాలి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు గ్రామ సచివాలయంలో సబ్‌కలెక్టర్ సంజనాసింహ్హా, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, అధికారులతో కలిసి భూసమస్యల పరిష్కారానికి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కారం జరిపే విధంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించాలని ఆదేశాలిచ్చిందన్నారు. అందుకు అనుగుణంగానే సభల ద్వారా రైతుల సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. నందివెలుగులో 17మంది భూ సంబంధిత సమస్యలను అర్జీల రూపంలో తెలిపారన్నారు. గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, డిసెంబరు 6: భూమి సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి రెవెన్యూ సదస్సును ప్రభుత్వ నిర్వహిస్తునట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో మ్యుటేషన్ కోసం ఐదు దరఖాస్తులు, రీప్లేస్‌మెంట్‌కు మూడు, ఆదాయ ధ్రువీకరణ కోసం రెండు, కుల ధ్రువీకరణకు ఒకటి, డిజిటల్ సిగ్నేచర్ కోసం రెండు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెండు, సర్వేకోసం రెండు దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూమి సంబంధిత సమస్యలు ఉన్న రైతులు నేరుగా దరఖాస్తులు అందిస్తే సత్వరమే పరిష్కరించనునట్లు చెప్పారు.

కొల్లిపరలో...

కొల్లిపర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం సచివాయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రాజేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను దరఖాస్తు ద్వారా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించటానికి వీలుకలుగుతుందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ వల్లభాపుం రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 16 దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణ చేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, ఈవో పద్మావతి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ జియావుల్ హక్, అధికారులు


వల్లభాపురం రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్న ప్రత్యేక అధికారి కృష్ణారావు

ఆదర్శనీయుడు అంబేద్కర్: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ


చేబ్రోలులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, చేబ్రోలు, డిసెంబరు 6: అంబేద్కర్ ఆశయాలను కొనసాగించటానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతోందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి ఘనంగా జరిపారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో జైభీమ్ సమూహం ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు దళిత సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జైభీమ్ సమూహం నిర్వాహకులు ఎద్దు శ్యామ్యూల్ రాజ్, వేముల నిరీక్షణరాజు, యడ్ల వందనం, గుమ్మడి రోశయ్య, పీఎల్ శ్రీను, జంగా రాజేష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, మొహ్మద్ చిష్తి, ఎద్దు శోంబాబు, షేక్ బాజీ, తోటకూర నరేష్, ఆరేటి రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ఆధ్వర్యంలో జరిగాయి. మానవ హక్కుల వేదిక కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల టీడీపీ, కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● పెదకాకాని: భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానం ఎంతో గొప్పదన్నారు. ఆయన రాజ్యాంగాన్ని రచించి అందరికీ ఫలాలు అందించారని ఆయన కొనియాడారు. పెదకాకాని సెంటర్లో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు.

● తెనాలి రూరల్: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తెనాలి రూరల్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు పార్టీ నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జొన్నాదులమహేష్, కంచర్ల ఏడుకొండలు, అత్తోట శరత్, మల్లవరపు విజయ్, పిసపాటి రవీంద్ర, మద్దుల సతీష్, నాగభూషణం,శ్రీవన్, కుదరవల్లి శ్రీనివాస్, పంచుమూర్తి భాస్కర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం : సమాజంలో నెలకొన్న వివక్షతను నిర్మూలనకు జీవితకాలం పోరాడి యోధుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది పీపీఆర్‌వీ సాగర్ మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తించిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు ఇందుపల్లి రాజారాం, పొన్నం విజయ్‌కుమార్, గంటి సురేష్ కుమార్, మధిర సురేష్‌కుమార్, అబ్రహంలింకన్, గుమాస్తాల అసోసియేషన్ అధ్యక్షులు సాగర్, సభ్యులు పాల్గొన్నారు.


కోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్నున్న న్యాయవాదులు

● తెనాలి అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మారీసుపేట బీజేఆర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత లెక్చరర్ పిసపాటి రాజశేఖర్, మేకల సురేష్, అత్తోట శరత్, ప్రేమ్‌కుమార్, ప్రతాప్, శ్యామ్, రమేష్, సురేష్, కొండలరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేద్కర్ మార్గం అనుసరణీయం

● ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్. అంబేద్కర్ మార్గం అనుసరణీయమని ఏఎన్‌యూ ఇన్చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు సూచించారు. శుక్రవారం వర్సిటీలోని డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల మనందరం భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెబుతున్నామన్నారు. కొలంబియా విశ్వవిద్యాలయం ఆయనను గ్లోబల్ ఐకాన్‌గా గుర్తించిందని పేర్కొన్నారు శ్రామికుల సంక్షేమానికి ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఆయన హయాంలో తీసుకువచ్చిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం సరైందని పేర్కొన్నారు దేశ తొలి న్యాయశాఖ మంత్రిగా ఆయన అనేక రకాల సవాళ్లను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. విశ్రాంత లెక్చరర్ డాక్టర్ మార్పు విన్సెంట్ పాల్ మాట్లాడుతూ అంబేద్కర్ 40 సంవత్సరాలకు పైగా వ్యవస్థపై పోరాడాడని గుర్తు చేశారు. ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్రం సంపాదించి 75 సంవత్సరాలు గడిచిన తర్వాత రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారతదేశ దిక్సూచిగా అంబేద్కర్ నిలుస్తారన్నారు. అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య యం.సురేష్‌కుమార్, వికాస అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, కార్యదర్శి జె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డి. విజయ్ ప్రకాష్, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజులు మాట్లాడారు. అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ బ్రహ్మాజీ రావు, అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

తెనాలి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని దాసరి మురళీకాంత్ చెప్పారు. నెహ్రూనికేతన్ స్కూల్‌లో నాలుగు రోజుల క్రీడా సంబరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యతో పాటు ప్రతి ఒక్కరూ ఏదో ఒక నైపుణ్యాన్ని సాధించాలన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రీడల ద్వారా లభిస్తాయని చెప్పారు. బాల బాలికలకు రన్నింగ్, ఖోఖో, షాట్‌పుట్, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురిపై న్యూసెన్స్ కేసు

తెనాలి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యూసెన్స్ చేస్తున్నారని ప్రశ్నించిన మహిళను కుటుంబ సభ్యులు ఏడుగురు కలిసి దాడిచేసి సంఘటన శుక్రవారం ఐతానగర్‌లో జరిగింది. పిల్లి స్వాతి అనే మహిళ తన ఇంటి సమీపంలో పిల్లి ప్రసాద్ కుటుంబ సభ్యులు తరుచూ గొడవ చేస్తుండతో ప్రశ్నించింది. దీంతో ప్రసాద్ కుటుంబ సభ్యులు ఏడుగురు ఆమెను దుర్భాషలాడి, దాడి చేసినట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఘర్షణ

మున్సిపల్ కార్యాలయం వద్ద మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. కార్పెంటర్‌గా పనిచేస్తున్న పిల్లి ఆనంద్‌ను మద్యం సేవించిన సురేష్, రాంబాబు వాహనం ఆపి లిఫ్ట్ అడిగారు. వాహనాన్ని ఆపకపోవటంతో ఇద్దరూ కలిసి అతనిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలు ఆన్‌లైన్ చేయడంలో జాప్యం

● సభ ముగిసే రెండు గంటల ముందువచ్చిన స్పెషల్ ఆఫీసర్
● మధ్యాహ్నం నుంచి అందుబాటులో లేని తహసీల్దార్

తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామసభల్లో ఫిర్యాదులు ఆన్‌లైన్ చేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకూ మండల పరిధిలోని సచివాలయాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని నందివెలుగులో తొలి గ్రామ సభ ప్రారంభమైంది. ఉదయం గ్రామసభ నిర్వహణకు రావాల్సిన ప్రత్యేక అధికారి ఏడీ హ్యాండ్‌లూమ్స్ గుంటూరు బి.ఉదయ్‌కుమార్ సాయంత్రం 3 గంటలకు వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ గ్రామ సమస్యలను తెలుసుకున్న తహసీల్దార్ గోపాలకష్ణ ఆ తరువాత నుండి శాఖపరమైన పనులపై బయటకు వెళ్లడంతో వీర్వోలు, వీఏఏలు సభను కొనసాగించారు. సభల్లో ప్రధాన అధికారులు లేకుండా, వీఆర్వోలు, వీర్ఏలే ఉండటం, అక్కడ ఉన్న సిబ్బంది రైతుల నుంచి అందుకున్న అర్జీలు కూడా ఆన్‌లైన్ చేయకపోవడంపై రైతులు సమస్యలు పరిష్కారమయ్యేనా అంటూ సందేహపడుతున్నారు.

సిబార్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం


సిబార్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

చేబ్రోలు, డిసెంబరు 6: గ్రామీణ ప్రాంతంలో పేదలకు దంతవైద్యం అందించటంతో సిబార్ దంత వైద్యశాల చేస్తున్న కృషి అభినందనీయం అని ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. చేబ్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన 200 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి టూత్ పేస్ట్‌లు, బ్రష్‌లు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, శిబార్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రవీంద్రనాథ్, లలిత ప్రకాశ్, రామ్ నారాయణ, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అబ్రహాంలింకన్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్‌లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● మండల వైద్యాధికారి లక్ష్మీసుధ

కొల్లిపర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్‌లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దంతలూరులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కావేరి, ఏఎన్ఎం స్వరూపరాణి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు రాజకుమారి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తలశిల వెంకట్రామయ్యకు ఘన నివాళి



వెంకట్రామయ్యకు నివాళి అర్పిస్తున్నఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు, పక్కన వెంకట్రామయ్య (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, డిసెంబరు 6: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు తలశిల వెంకట్రామయ్య మృతి పొన్నూరు ప్రాంతానికి తీరని లోటు అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడు తలశిల వెంకట్రామయ్య గురువారం హైదరాబాదులో మృతిచెందారు. వెంకట్రామయ్య మృతదేహాన్ని శుక్రవారం మండల పరిధిలోని దొప్పలపూడి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వెంకట రామయ్య మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేసారు. 1977 జనతా పార్టీ నుంచి, 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి పొన్నూరు శాసన సభకు వెంకట్రామయ్య పోటీ చేశారు. ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి సలహాదారుడుగా, కేంద్ర ప్రభుత్వ విభాగాలైన ఎక్స్‌టర్నల్ మినిస్ట్రీ, ఫైనాన్స్, హోమ్ విభాగాల్లో కీలక పదవులు నిర్వహించారు. 1994 తర్వాత కాంగ్రెస్ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్న వెంకట్రామయ్య ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సహకారంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. వెంకట్రామయ్య స్వగ్రామం మునిపల్లె గ్రామమైనప్పటికి దొప్పలపూడితో అనుబంధం ఉంది. బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య వెంకట్రామయ్యకు శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి.


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

సచివాలయ సేవలను ప్రజలకు చేరువచేయండి

● అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సేవలను ప్రజలకు చేరువచేస్తూ ఉద్యోగులు మంచిపేరు తెచ్చుకోవాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 7, 21, 23 వార్డుల సచివాలయాలను ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న సౌకర్యాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి అక్కడ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు మునిసిపల్ అధికారులు, సచివాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.